03-10-2021 ఉదయము మురళి ఓంశాంతి " అవ్యక్త బాప్‌దాదా "

రివైజ్ -31-03-1988 మధువనము

---

## " వాచా మరియు కర్మణా " - రెండు శక్తులను జమ చేసుకునేందుకు ఈశ్వరీయ పథకం (స్కీము)

ఈ రోజు ఆత్మిక దీపం(శమా)తన ఆత్మిక దీపపు పురుగులను(పర్వానే)-చూస్తున్నారు. నలువైపులా ఉన్న దీపపు పురుగులు దీపం పైన బలిహారి అయ్యారు అనగా సమర్పణ అయ్యారు. సమర్పణ అనగా బలిహారమయ్యే దీపపు పురుగులు అనేకమంది ఉన్నారు కాని సమర్పణ అయిన తర్వాత దీపం(బాబా) స్నేహంలో 'దీపం సమానంగా' అవ్వడంలో, సమర్పణ చేయడంలో నంబరువార్‌గా ఉన్నారు. వాస్తవానికి హృదయపూర్వక స్నేహం కారణంగానే సమర్పణ అవుతారు. ' హృదయపూర్వక స్నేహం ' మరియు ' స్నేహం ' - రెండిటిలో వ్యత్యాసముంది. స్నేహమైతే అందరికి ఉంది, స్నేహం కారణంగానే సమర్పణయ్యారు. ' హృదయపూర్వక స్నేహీలు ' బాబా హృదయంలోని విషయాలను లేక హృదయంలోని ఆశలను తెలుసుకుంటారు అంతేకాక పూర్తి కూడా చేస్తారు. హృదయ పూర్వక స్నేహీలు అనగా బాబా హృదయంలోని ఆశలను పూర్తి చేసేవారు.హృదయపూర్వక స్నేహీలు అనగా బాబా హృదయం ఏం చెప్తుందో అది పిల్లల హృదయంలో ఇమిడిపోతుంది. ఏదైతే హృదయంలో ఇమిడిపోతుందో అది కర్మలోకి స్వతహాగానే వస్తుంది. ' స్నేహీ ' ఆత్మలకు కొన్ని విషయాలు హృదయంలో ఇమిడిపోతాయి, కొన్ని బుద్ధిలో ఇమిడిపోతాయి. హృదయంలో ఇమిడిపోయిన విషయాలను కర్మలోకి తీసుకొస్తారు, బుద్ధిలో ఇమిడిపోయిన వాటి గురించి ' చేయగలమా లేదా, చేయాల్సిందే, సమయానికి అయిపోతుందిలే ' అని ఆలోచిస్తారు. ఇలాంటి ఆలోచనలు నడిచే కారణంగా ఆలోచన వరకే ఉండిపోతుంది, కర్మలోకి రాదు.

ఈ రోజు బాప్‌దాదా చూశారు - అందరూ సమర్పణ అయ్యేవారే. ఒకవేళ సమర్పణ అవ్వకపోతే బ్రాహ్మణులని పిలవబడరు. కాని బాబా స్నేహంలో బాబా ఏం చెప్తారో అది చేసేందుకు సమర్పణ చేయాల్సి వస్తుంది అనగా ' నేను ' అనే భావనను త్యాగం చేయాలి. 'నేను' అనే భావనలో అభిమానం ఉన్నా లేక బలహీనతలు ఉన్నా - రెండిటిని త్యాగం చేయాల్సి వస్తుంది, దీనినే సమర్పణ అని అంటారు. సమర్పణ అయ్యేవారు చాలామంది ఉన్నారు కాని 'నేను అనేదానిని' సమర్పణ చేయడంలో ధైర్యం గలవారు నంబరువార్‌గా ఉన్నారు.

ఈ రోజు బాప్‌దాదా కేవలం ఒక నెల రిజల్టును చూశారు. ఇదే సీజన్‌లో విశేషంగా బాప్‌దాదా 'బాబా సమానంగా' అయ్యేందుకు రకరకాల రూపాల ద్వారా ఎన్నోసార్లు

సూచనలు ఇచ్చారు అంతేకాక  బాప్‌దాదా హృదయంలో విశేషంగా ఇదే శ్రేష్ఠమైన ఆశ ఉంది. ఇంత  ఖజానా లభించింది, వరదానాలు లభించాయి! వరదానాల కొరకు పరుగు పరుగున వచ్చారు. పిల్లలు స్నేహంతో కలుసుకునేందుకు వస్తారు, వరదానాలు తీసుకొని సంతోషిస్తారని బాబాకు కూడా సంతోషమవుతుంది. కాని బాబా హృదయంలోని ఆశను పూర్తి చేసేవారెవరు? బాబా వినిపించిన వాటిని కర్మలోకి ఎంతవరకు తీసుకొచ్చారు? మనసా, వాచా, కర్మణా - మూడింటి ఫలితం ఎంతవరకు వచ్చిందని భావిస్తున్నారు? సంబంధ-సంపర్కాలలో శక్తిశాలి మనసు ఎంతవరకు వచ్చింది? కేవలం మీ అంతట మీరు కూర్చుని మననం చేయడం స్వ-ఉన్నతికి చాలా మంచిది మరియు చేయాల్సిందే. కాని శ్రేష్ఠ ఆత్మల శ్రేష్ఠమైనమనసు అనగా సంకల్పాలు శక్తిశాలిగా, శుభ భావన, శుభ కామనలు కలిగి ఉంటాయి. మనసా శక్తికి దర్పణం ఏది? మాటలు మరియు కర్మలే దర్పణము. అజ్ఞానీ ఆత్మలకు గాని, జ్ఞానీ ఆత్మలకు గాని ఇరువురి సంబంధ -సంపర్కంలో మాటలు మరియు కర్మలే మనసా శక్తికి దర్పణము. ఒకవేళ మాటలు, కర్మలు శుభ భావన, శుభ కామనలు కలిగి లేకుంటే మనసాశక్తి యొక్క ప్రత్యక్ష స్వరూపం ఎలా అర్థమవుతుంది? ఎవరి మనసు శక్తిశాలిగా, శుభంగా ఉందో వారి మాటలు మరియు కర్మలు స్వతహాగానే శక్తిశాలిగా, శుద్ధంగా ఉంటాయి, శుభ భావన కలిగి ఉంటాయి. మనసు శక్తిశాలిగా ఉండడం అనగా స్మృతి శక్తి శ్రేష్ఠంగా ఉంటుంది,శక్తిశాలిగా ఉంటుంది, సహజ యోగులుగా కూడా ఉంటారు. కేవలం సహజ యోగులుగా కాదు, సహజ కర్మయోగులుగా కూడా ఉంటారు.



బాప్‌దాదా గమనించారు - స్మృతిని శక్తిశాలిగా చేసుకోవడంలో చాలామంది పిల్లలకు అటెన్షన్ ఉంది, స్మృతిని సహజంగా మరియు నిరంతరంగా చేసుకోవాలనే ఉమంగ-ఉత్సాహాలు ఉన్నాయి. ముందుకు వెళ్తూ ఉన్నారు మరియు వెళ్తూ కూడా ఉంటారు ఎందుకంటే బాబాతో స్నేహం బాగుంది కనుక స్మృతి చేయడంలో అటెన్షన్ బాగుంది. స్మృతికి ఆధారమే ‘ స్నేహము ’. అందరు బాబాతో ఆత్మిక సంభాషణ కూడా బాగా చేస్తారు. అప్పుడప్పుడు ఎప్పుడైనా పరస్పరంలో కొంచెం కోపగించుకున్నారంటే కొద్దిగా కళ్ళు కూడా చూపిస్తారు. తర్వాత బాబాతో “మీరెందుకు సరి చేయరు?” అని ఫిర్యాదు చేస్తారు. అయినా అవి స్నేహంతో నిండిన ప్రేమపూర్వకమైన నయనాలు. కానిసంఘటనలో వచ్చినప్పుడు, కర్మలోకి వచ్చినప్పుడు, కార్య వ్యవహారంలోకి వచ్చినప్పుడు, పరివారంలోకి వచ్చినప్పుడు సంఘటనలో మాటలు అనగా వాచా శక్తి వ్యర్థమవ్వడం కనిపిస్తోంది.

వాచా శక్తి వ్యర్థమయ్యే కారణంగా మాటల ద్వారా ఏదైతే బాబాను ప్రత్యక్షం చేసే పదును లేక శక్తిని అనుభవం చేయించాలో అది తక్కువైపోతుంది. మీ మాటలు బాగా అనిపిస్తాయి, అది వేరే విషయం. బాబా వినిపించిన మాటలను రిపీట్ చేస్తారు కనుక అవి తప్పకుండా బాగా అనిపిస్తాయి. కాని వాచా శక్తి వ్యర్థమయ్యే కారణంగా శక్తి జమ అవ్వదు అందువలన బాబాను ప్రత్యక్షం చేసే శబ్దం ప్రతిధ్వనించడంలో ఆలస్యం జరుగుతోంది. సాధారణ మాటలు ఎక్కువగా ఉన్నాయి. ‘అలౌకిక మాటలుగా ఉండాలి, ఫరిస్తాల మాటలుగా ఉండాలి.’ ఈ సంవత్సరం దీనిని అండర్‌లైన్ చేసుకోండి. ఉదాహరణకు మీరు బ్రహ్మాబాబాను చూశారు - ఫరిస్తాల వలె మాట్లాడేవారు, తక్కువగా మరియు మధురంగా మాట్లాడేవారు. ఏ మాటలకైతే ఫలితం వెలువడ్తుందో అవి యదార్థమైన మాటలు, ఏ మాటలకైతే ఎలాంటి ఫలితమూ ఉండదో అవి వ్యర్థ మాటలు. కార్య వ్యవహారాలలో కూడా ఫలితం ఉండాలి. కార్య-వ్యవహారాలలో కూడా మాట్లాడాల్సి వస్తుంది కదా, అక్కడ కూడా ఎక్కువగా మాట్లాడకండి. ఇప్పుడు శక్తిని జమ చేసుకోవాలి. ఎలాగైతే ‘స్మృతి’ ద్వారా మనసా శక్తిని జమ చేసుకుంటారో, సైలెన్స్‌లో కూర్చున్నప్పుడు ‘ సంకల్ప శక్తి ’ జమ అవుతుందో అలా వాచా శక్తిని కూడా జమ చేసుకోండి.

నవ్వు వచ్చే విషయం ఒకటి చెప్తున్నాను - బాప్‌దాదా వతనంలో అందరి జమా భండారీలు (హుండీలు) ఉన్నాయి. మీ సేవాకేంద్రాలలో కూడా భండారీలు ఉన్నాయి కదా. బాబా వతనంలో పిల్లలకు చెందిన భండారీలు ఉన్నాయి. ప్రతి ఒక్కరు పూర్తి రోజంతటిలో మనసా, వాచా, కర్మణా - మూడు శక్తులను పొదుపు చేసి జమ చేస్తారో ఆ భండారీ ఉంది. మనసాశక్తిని ఎంత జమ చేశారో,వాచా శక్తిని, కర్మణా శక్తిని ఎంత జమ చేశారో దీని పూర్తి లెక్కాచారం ఉంది. మీరు కూడా ఖర్చు మరియు పొదుపుల లెక్కాచారం పంపిస్తారు కదా. కనుక బాప్‌దాదా మీరు జమ చేసిన భండారీలను చూశారు. ఫలితం

ఏం వచ్చి ఉంటుంది? జమ ఖాతా ఎంత వెలువడి ఉండవచ్చు? ప్రతి ఒక్కరికి వారి వారి ఫలితం ఉంది. భండారీలైతే చాలా నిండుగా ఉన్నాయి కాని చిల్లర ఎక్కువగా ఉంది. చిన్న పిల్లలు హుండీలో చిల్లర జమ చేస్తే హుండీ ఎంత బరువుగా అవుతుంది! అలా వాచా ఫలితంలో కూడా విశేషంగా ఇదే ఎక్కువగా చూశారు. స్మృతి పైన ఎంత అటెన్షన్ ఉందో అంత అటెన్షన్ వాచా పైన లేదు. కనుక ఈ సంవత్సరం వాచా మరియు కర్మణా - ఈ రెండు శక్తులను జమ చేసుకునే స్కీము(పథకం) తయారు చేయండి. గవర్నమెంట్ కూడా రకరకాల విధుల ద్వారా పొదుపు పథకాలను తయారు చేస్తుంది కదా. అలాగే ఇక్కడ ముఖ్యమైనది మనసు అని అందరికి తెలుసు. కాని మనసా జతజతలో విశేషంగా మాటలు మరియు కర్మలు - ఇవి సంబంధ-సంపర్కంలో స్పష్టంగా కనిపిస్తాయి. మనసు గుప్తమైనది కాని ఇవి ప్రత్యక్షంగా కనిపిస్తాయి. మాటలను జమ చేసుకునే సాధనము- 'తక్కువ మాట్లాడండి, మధురంగా మాట్లాడండి, స్వమానంతో మాట్లాడండి.' బ్రహ్మాబాబా చిన్నవారిని లేక పెద్దవారిని స్వమానంతో కూడిన మాటల ద్వారా తనవారిగా చేసుకున్నాడు. ఈ విధి ద్వారా ఎంత ముందుకు వెళ్తారో అంత త్వరగా విజయమాల తయారవుతుంది. కనుక ఈ సంవత్సరం ఏం చేయాలి? సేవతో పాటు విశేషంగా ఈ శక్తులను జమ చేసుకుంటూ సేవ చేయాలి.



సేవ కొరకు అందరూ మంచి మంచి ప్లాన్లు తయారుచేశారు. నలువైపులా ఇప్పటివరకు  భారతదేశంలో గాని, విదేశాలలో గాని ప్లాన్ల అనుసారంగా ఏదైతే సేవ చేస్తున్నారో అది బాగా చేస్తున్నారు మరియు చేస్తారు కూడా. ఎలాగైతే సేవలో ఒకరి కంటే

ఒకరు మంచి మంచి రిజల్టు తీసుకు రావాలనే శుభ భావనతో ముందుకు వెళ్తున్నారో అలా సేవలో సంఘటిత రూపంలో సదా సంతుష్టంగా ఉంటూ మరియు సంతుష్టంగా చేసే విశేషమైన సంకల్పం కూడా సదా జత జతలో ఉండాలి ఎందుకంటే ఒకే సమయంలో మూడు ప్రకారాల సేవ జత జతలో జరుగుతుంది. మొదటిది - స్వయం సంతుష్టత, ఇది స్వ - సేవ, రెండవది - సంఘటనలో సంతుష్టత, ఇది పరివారం యొక్క సేవ, మూడవది - భాష ద్వారా లేక ఏదైనా విధి ద్వారా విశ్వాత్మల సేవ. ఇలా ఒకే సమయంలో మూడు సేవలు జరుగుతాయి. ఏదైనా ప్రోగ్రామ్ తయారుచేసినప్పుడు అందులో మూడు సేవలు ఇమిడి ఉన్నాయి. ఎలాగైతే విశ్వ సేవ యొక్క రిజల్టు లేక విధి గురించి గమనముంచుతారో అలా మిగిలిన రెండు సేవలు 'స్వ' మరియు 'సంఘటన' సేవలను కలుపుకొని మూడు సేవలు నిర్విఘ్నంగా ఉండాలి, అప్పుడు సేవలో నంబరువన్ సఫలత వచ్చిందని అంటారు. మూడు సఫలతలు జతలో ఉండడమే నంబరు తీసుకోవడం. ఈ సంవత్సరం మూడు సేవలలో సఫలత జతజతలో ఉండాలి - ఈ నగాడా(ఢంకా) మ్రోగాలి. ఒకవేళ కేవలం ఒక మూలలో నగాడా మ్రోగితే కుంభకర్ణుల చెవుల వరకు చేరుకోదు. నలువైపులా ఈ నగాడా మ్రోగినప్పుడు కుంభకర్ణులందరు మేల్కొంటారు. ఇప్పుడైతే ఒకరు మేల్కొంటే రెండవవారు నిద్రపోతారు, రెండవవారు మేల్కొంటే మూడవవారు నిద్రపోతారు. కొద్దిగా మేల్కొన్నా 'బాగుంది, బాగుంది' అని మళ్లీ నిద్రపోతారు. కాని మేల్కొని నోటి ద్వారా లేక మనసు ద్వారా 'అహో ప్రభూ!' అని అనాలి, ముక్తి వారసత్వం తీసుకోవాలి, అప్పుడు సమాప్తమవుతుంది. మేల్కొన్నప్పుడే కదా ముక్తి వారసత్వాన్ని తీసుకుంటారు. కనుక ఏం చేయాలో అర్థమయిందా?ఒకరికొకరు సహయోగులుగా అవ్వండి. ఇతరుల రక్షణలో మీ రక్షణ అనగా పొదుపు జరుగుతుంది.

సేవా ప్లానులో ఎంత సమీప సంపర్కంలోకి తీసుకొస్తారో అంత సేవకు ప్రత్యక్ష ఫలితం కనిపిస్తుంది. సందేశమిచ్చే సేవ అయితే చేస్తూ వచ్చారు, చేస్తూ ఉండండి కాని విశేషంగా ఈ సంవత్సరం కేవలం సందేశమివ్వడమే కాక సహయోగులుగా చేయండి అనగా సమీప సంపర్కంలోకి తీసుకు రండి. కేవలం ఫారం నింపించడం అయితే నడుస్తూ ఉంటుంది కాని ఈ సంవత్సరం ఇంకా ముందుకు వెళ్లండి. ఫారంను నింపించండి కాని ఫారం నింపించి వదిలేయకండి, సంబంధంలోకి తీసుకు రండి. ఎటువంటి వ్యక్తియో ఆ విధంగా సంపర్కంలోకి తీసుకొచ్చేందుకు ప్లాన్లు తయారు చేయండి. చిన్న-చిన్న ప్రోగ్రామ్స్ చేసినా ఇదే లక్ష్యాన్ని పెట్టుకోండి. కేవలం ఒక గంట కొరకు లేక ఫారమ్ నింపే సమయం వరకు మాత్రమే సహయోగులుగా చేయడం కాదు కాని సహయోగం ద్వారా వారిని సమీపంగా తీసుకు రావాలి. సంబంధ-సంపర్కంలోకి తీసుకు రండి. తద్వారా ముందు సేవ యొక్క రూపం పరివర్తనవుతుంది. మీరు మీకోసం

చేయాల్సి ఉండదు, మీ తరపున సంబంధంలోకి వచ్చేవారు మాట్లాడ్తారు, మీరు కేవలం ఆశీర్వాదాలు మరియు దృష్టి ఇవ్వాల్సి ఉంటుంది. ఎలాగైతే ఈ రోజుల్లో శంకరాచార్యుల వారిని కుర్చీ పైన కూర్చోబెడ్తారో అలా మిమ్ములను పూజ్య కుర్చీ పైన కూర్చోబెడ్తారు, వెండి కుర్చీ పైన కాదు. భూమిని తయారుచేసేవారు నిమిత్తంగా అవుతారు, మీరు కేవలం దృష్టి ద్వారా బీజం వేయాలి, రెండు ఆశీర్వాదాల మాటలు మాట్లాడాలి, అప్పుడే ప్రత్యక్షత జరుగుతుంది. మీలో బాబా కనిపిస్తారు అంతేకాక మీ ద్వారా బాబా దృష్టిని, బాబా స్నేహాన్ని అనుభూతి చేసిన వెంటనే ప్రత్యక్షతా ధ్వని మ్రోగడం ప్రారంభమైపోతుంది.

ఇప్పుడు సేవలో గోల్డన్ జూబ్లీని పూర్తి చేసుకున్నారు. ఇప్పుడిక ఇతరులు సేవ చేస్తారు, మీరు చూసి హర్షిస్తూ ఉంటారు. పోప్(క్రైస్తవ మత పెద్ద) ఏం చేస్తాడు? పెద్ద సభ మధ్యలో దృష్టినిచ్చి ఆశీర్వాదాల మాటలు మాట్లాడ్తాడు. దీర్ఘంగా ఉపన్యసించేందుకు ఇతరులు నిమిత్తంగా అవుతారు. మాకు బాబా వినిపించారని మీరు చెప్తూ వచ్చారు కాని 'మీరు ఏది వినిపించారో అది బాబా వినిపించిందే, ఇంకెవ్వరూ లేనే లేరు' అని ఇతరులు మీ బదులుగా చెప్తారు. నెమ్మది నెమ్మదిగా ఇలాంటి హ్యాండ్స్ (సహయోగులు) తయారవుతారు. సేవాకేంద్రాలను సంభాళించేందుకు హ్యాండ్స్ తయారయ్యారు కదా అలా స్టేజి పైన మీ తరపున మాట్లడేవారు, అనుభవం చేసి మాట్లడేవారు వెలువడ్తారు. కేవలం మహిమ చేసేవారు కాదు జ్ఞానంలోని లోతైన పాయింట్లను స్పష్టం చేసేవారు, పరమాత్మ జ్ఞానాన్ని సిద్ధి(ఋజువు) చేసేవారు వెలువడ్తారు. కాని దీని కొరకు అటువంటి వ్యక్తులను స్నేహీలుగా, సహయోగులుగా సంపర్కంలోకి తీసుకొస్తూ సంబంధంలోకి తీసుకు రండి. ఈ పూర్తి కార్యక్రమం యొక్క లక్ష్యమేమంటే - మీరు స్వయం ' మైట్ ' గా అవ్వాలి, వారు ' మైక్ ' గా అవ్వాలి - ఇలాంటి సహయోగులును తయారు చేయండి. ఈ సంవత్సరం అందరి సహయోగం ద్వారా జరిగే సేవా లక్ష్యమేమంటే 'మైక్' ను తయారు చేయడం. వారు తమ అనుభవం యొక్క ఆధారంతో మీ జ్ఞానాన్ని లేక బాబా జ్ఞానాన్ని ప్రత్యక్షం చేయాలి. ఎవరి ప్రభావమైతే స్వతహాగానే ఇతరులపై పడ్తుందో అలాంటి మైక్‌ను తయారు చేయండి. సేవా ఉద్ధేశ్యం ఏమిటో అర్థమయిందా? ఇన్ని ప్రోగ్రామ్స్ తయారుచేశారు, వీటి నుండి ఏ వెన్న(ఫలితం) వెలువడ్తుంది? బాగా సేవ చేయండి కాని ఈ సంవత్సరం సందేశమివ్వడంతో పాటు దీనిని కలుపుకోండి. ఎవరెవరు ఇలాంటి పాత్రులుగా ఉన్నారో వారిని దృష్టిలో ఉంచుకోండి అంతేకాక వారిని సమయ ప్రతి సమయం రకరకాల విధుల ద్వారా సంపర్కంలోకి తీసుకు రండి. ఒక ప్రోగ్రామ్ చేశారు, తర్వాత రెండవది చేశారు, తర్వాత మూడవది చేశారు, ఇలా చేసుకుంటూ మొదటి ప్రోగ్రాంలో వచ్చినవారిని మూడవ ప్రోగ్రాంవారు రాగానే వదిలేయడం కాదు. ఇందులో కూడా జమ చేసుకునే శక్తిని ప్రయోగించాల్సి ఉంటుంది. ప్రతి ప్రోగ్రాం ద్వారా(వ్యక్తులను) జమ చేస్తూ వెళ్లండి.

చివర్లో ఇలా సంబంధ-సంపర్కంలోకి వచ్చినవారి మాల తయారవ్వాలి. అర్థమయిందా? ఇక ఏం మిగిలింది? కలుసుకునే ప్రోగ్రాం మిగిలింది.

ఈ సంవత్సరం బాప్‌దాదా 6 మాసాల సేవా ఫలితాన్ని చూడాలనుకుంటున్నారు. ఎవరైతే సేవా ప్లాన్లు తయారుచేశారో వారు ఒకరికొకరు సహయోగులుగా అయి నలువైపులా బాగా తిరగండి. చిన్న-పెద్ద అందరినీ ఉమంగ-ఉత్సాహాలలోకి తీసుకొచ్చి మూడు ప్రకారాల సేవలో ముందుకు తీసుకెళ్లండి. అందుకే బాప్‌దాదా ఈ సంవత్సరం పూర్తి రాత్రిని పగలుగా చేసి సేవ ఇచ్చారు. ఇది మూడు ప్రకారాల సేవా ఫలితాన్ని తినే సంవత్సరం. ఫలం వచ్చే సంవత్సరం కాదు, ఫలం తినే సంవత్సరం. ఇది ఫలం వచ్చే సంవత్సరంగా నిర్ణయించబడలేదు. బాబా ఇచ్చే సకాశ్ అయితే సదా జతలోనే ఉంది. డ్రామాలో నిర్ణయింపబడి ఉన్న విషయాన్ని వినిపించాను. డ్రామాకు ఏది అంగీకారమో దానిని అంగీకరించాల్సే ఉంటుంది. సేవ బాగా చేయండి. 6 మాసాలలోనే ఫలితం తెలిసిపోతుంది. బాబా ఆశలను పూర్తి చేసే ప్లాన్ తయారుచేయండి. ఎక్కడ చూసినా, ఎవరిని చూసినా ప్రతి ఒక్కరి సంకల్పాలు, మాటలు మరియు కర్మలు బాబా ఆశల దీపాన్ని వెలిగించేవిగా ఉండాలి. మొదట మధువనంలో ఈ ఉదాహరణ చూపించండి. పొదుపు



పథకం యొక్క మాడల్‌ను(నమూనాను) మొదట మధువనంలో తయారుచేయండి. ఇది మొదట బ్యాంకులో జమ చేయండి. మధువనం వారికి కూడా వరదానాలు లభించాయి. మిగిలిన వారికి కూడా ఈ సంవత్సరంలో త్వరగా పూర్తి చేస్తాము ఎందుకంటే బాబా స్నేహమైతే పిల్లలందరి జతలో ఉంది. వాస్తవానికి ప్రతి పుత్రునికి ప్రతి అడుగులో వరదానం ఉంది. హృదయపూర్వక స్నేహీలు ప్రతి అడుగు వరదానంతోనే వేస్తారు. బాబా వరదానాలను కేవలం నోటి ద్వారా మాత్రమే ఇవ్వరు, హృదయంతో కూడా ఇస్తారు. హృదయంతో ఇచ్చే వరదానం సదా హృదయపూర్వక సంతోషాన్ని, ఉమంగ -ఉత్సాహాలను అనుభవం చేయిస్తుంది. ఇది హృదయపూర్వకంగా వరదానం ఇచ్చిన దానికి గుర్తు. హృదయపూర్వక వరదానాలను హృదయంలో ధారణ చేసిన వారి గుర్తు ఏమంటే వారు సదా సంతోషం మరియు ఉమంగ-ఉత్సాహాలతో ముందుకు వెళ్తూ ఉంటారు. ఎప్పుడూ ఏ విషయాలలోనూ చిక్కుకోరు, ఆగరు. వరదానాలతో ఎగురుతూ ఉంటారు, మిగిలిన అన్ని విషయాలు క్రింద ఉండిపోతాయి. ఎగిరేవారిని పక్కదృశ్యాలు (సైడ్‌సీన్స్) కూడా ఆపలేవు.

ఈ రోజు బాప్‌దాదా పిల్లలందరికి ఎవరైతే హృదయపూర్వకంగా, అలసిపోకుండా సేవ చేశారో ఆ సేవాధారులందరికి ఈ సీజన్‌లో చేసిన సేవకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మధువనానికి వచ్చి మధువనానికి అలంకారంగా అయిన పిల్లలందరికి బాప్‌దాదా శుభాకాంక్షలనిస్తున్నారు మరియు నిమిత్తంగా అయిన శ్రేష్ఠ ఆత్మలకు కూడా సదా అలసిపోనివారిగా అయి బాబా సమానంగా తమ సేవల ద్వారా అందరినీ రిఫ్రెష్ చేసినందుకు శుభాకాంక్షలనిస్తున్నారు అంతేకాక రథానికి కూడా శుభాకాంక్షలు. నలువైపులా ఉన్న సేవాధారి పిల్లలకు శుభాకాంక్షలు. నిర్విఘ్నంగా ముందుకు వెళ్తున్నారు మరియు ముందుకు వెళ్తూ ఉండండి. దేశ-విదేశాల పిల్లలందరికి మధువనానికి వచ్చినందుకు మరియు రిఫ్రెష్(తాజాగా) అయినందుకు శుభాకాంక్షలు. కాని సదా తాజాగా ఉండండి, కేవలం 6 మాసాల వరకే కాదు. రిఫ్రెష్ అయ్యేందుకు భలే రండి ఎందుకంటే బాబా ఖజానా పైన పిల్లలందరికి సదా అధికారముంది. బాబా మరియు ఖజానా సదా జతలో ఉంది మరియు సదా జతలోనే ఉంటుంది. కేవలం ఏ విషయాన్నైతే అండర్‌లైన్ చేయించారో అందులో విశేషంగా స్వయాన్ని ఉదాహరణగాతయారుచేసుకొని పరీక్షలో అదనపు మార్కులు తీసుకోవాలి. ఇతరులను చూడరాదు, స్వయాన్ని ఉదాహరణగా చేసుకోవాలి. ఇందులో ఎవరు చేస్తారో వారే అర్జునులుఅనగా నంబరువన్. మళ్లీ బాప్‌దాదా వచ్చినప్పుడు ప్రతి ఒక్కరు సదా ఫరిస్తాల కర్మలు, ఫరిస్తాల మాటలు, ఫరిస్తాల సంకల్పాలు చేసేవారిగా కనిపించాలి. ఇలాంటి పరివర్తన సంఘటనలో కనిపించాలి. ఈ ఫరిస్తాల మాటలు, ఫరిస్తాల కర్మలు ఎంత అలౌకికంగా ఉన్నాయని ప్రతి

ఒక్కరు అనుభవం చేయాలి. ఈ పరివర్తనా సమారోహాన్ని బాప్‌దాదా చూడాలను కుంటున్నారు. ఒకవేళ ప్రతి ఒక్కరు పూర్తి రోజంతటిలో మీ మాటలను టేప్(రికార్డ్) చేస్తే మీకు చాలా బాగా తెలిసిపోతుంది. చెక్ చేసుకుంటే ఎంత వ్యర్థం పోతోందో తెలిసిపోతుంది. మనసులో రికార్డ్ చేసి చెక్ చేయండి, స్థూలంగా కాదు. సాధారణ మాటలు కూడా వ్యర్థంలో జమ అవుతాయి. ఒకవేళ నాలుగు మాటలకు బదులు 24 మాటలు మాట్లాడితే 20 మాటలు ఎందులోకి వెళ్లినట్లు? శక్తిని జమ చేసుకోండి, అప్పుడు మీరు మాట్లాడే రెండు ఆశీర్వాదాల మాటలు ఒక గంట ఉపన్యసించిన పని చేస్తాయి. అచ్ఛా.

నలువైపులా ఉన్న సర్వ సమర్పణ అయ్యే ఆత్మిక దీపపు పురుగులకు, బాబా సమానంగా అయ్యే దృఢ సంకల్పం ద్వారా ముందుకు వెళ్లే విశేష ఆత్మలందరికి, సదా ఎగిరేకళ ద్వారా ఏ ప్రకారమైన పక్కదృశ్యమునైనా దాటుకునే డబల్‌లైట్ పిల్లలకు ఆత్మికదీపమైన బాప్‌దాదా ప్రియస్మృతులు మరియు నమస్తే.

వరదానము :- " కళ్యాణ భావన ద్వారా ప్రతి ఆత్మ సంస్కారాలను పరివర్తన చేసే నిశ్చయబుద్ధి భవ "

తండ్రిలో ఎలాగైతే 100 శాతం నిశ్చయముందో, ఎవరెంతగా కదిలించే ప్రయత్నం చేసినా కదలరో అలా దైవీ పరివారం ద్వారా లేక ప్రాపంచిక ఆత్మల ద్వారా, ఎవరు ఎలాంటి పరీక్ష తీసుకున్నా, క్రోధీలుగా అయి ఎదిరించినా లేక ఎవరైనా అవమానించినా, నిందించినా - అందులో కూడా చలించజాలరు. ఇందులో కేవలం ప్రతి ఆత్మ పట్ల కళ్యాణ భావన ఉండాలి. ఈ భావన అనేక సంస్కారాలను పరివర్తన చేస్తుంది. ఇందులో కేవలం అధైర్య పడరాదు, అంతే. సమయ ప్రమాణంగా ఫలం తప్పకుండా లభిస్తుంది - ఇది డ్రామాలోని నిర్ణయము.

స్లోగన్ :- " పవిత్రతా శక్తి ద్వారా మీ సంకల్పాలను శుద్ధంగా, జ్ఞాన స్వరూపంగా చేసుకొని బలహీనతలను సమాప్తం చేయండి. "

-: ఓంశాంతి :-